క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మధుసూదనరావు సేవలు ఆర్పీఎఫ్‌కే గర్వకారణం



లక్ష్మీపురం: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) శాఖలో మధుసూదనరావు అందించిన సేవలు సాటిలేనివని ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేలు పేర్కొన్నారు. ఆదివారం పట్టాభిపురంలోని డి.ఆర్.ఎం. కార్యాలయంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ శైలేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ పరంగా మధుసూదనరావుకు దక్కినన్ని అవార్డులు, రివార్డులు మరే అధికారికి దక్కలేదని కొనియాడారు. సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది రాష్ట్రపతి పోలీస్ మెడల్ వరించిందని చెప్పారు. డెప్యూటీ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సమర్థత, విశ్వసనీయత, దక్షత ఉంటే ఏ అధికారైనా తప్పక రాణిస్తారన్నారు. డిపార్ట్‌మెంట్‌లో మధుసూదనరావు తన శక్తిమేర పనిచేసి మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. రిటైర్డ్ అధికారి మధుసూదనరావు మాట్లాడుతూ కష్టపడితే ఏదైనా సాధించవచ్చునన్నారు. ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనన్నారు. అనంతరం మధుసూదనరావు ఘనంగా సత్కరించి దంపతులను మేళతాళాలతో టాపు లేని జీపులో ఊరేగించి,వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ అధికారులు శైలేష్, పవన్ సింగ్, చెంచయ్య, మర్రి సాంబశివరావు, మురళీకృష్ణ, రవిశంకర్, చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, నారాయణ కుటుంబ సభ్యులు గోళ్లమూడి భాస్కరరావు, శ్రీనివాస్, సుశీల, బోడెపూడి అనిల్, జ్యోతి, గుమ్మడి సుబ్బారావు, భార్గవి పాల్గొన్నారు.

18వ మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విశాఖపట్నంలో నిర్వహించనున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించేందుకు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. పాలకులు కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటూ, కార్మిక వర్గాన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ తరుణంలో విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని అన్నారు. అనంతరం ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉండవల్లి కమిటీ అధ్యక్షుడిగా ఆవల నారాయణ, కార్యదర్శిగా మాగలూరి స్వర్ణ కుమారి, మరో తొమ్మిది మందితో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వాషింగ్ ప్లాట్‌ఫామ్‌కు శంకుస్థాపన

దుగ్గిరాల: చేతిపంపుల స్థానంలో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణం కోసం భూమి పూజ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న చేతి పంపుల స్థానంలో నూతనంగా రూ.1.60 లక్షల వ్యయంతో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నామని, దీంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.శోభాదేవి, దోస్త్ కమిటీ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గ సభ్యులు, గూడూరు వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోరంపూడి గ్రైటనాల్టైస్‌కి పరుపులు అందజేత..

గ్రైటనాల్టైస్ డైరెక్టర్ వంగర హేమ చందు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోరంపూడిలో ఉన్న గ్రైటనాల్టైస్ లెప్రసీ ఆసుపత్రికి రోగుల అవసరాల నిమిత్తం పరుపులు, దిండ్లను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సిబ్బంది ఆదివారం అందించారు.

ఆరంభ శూరత్వమే..!

- పొన్నూరు పట్టణంలో తూతూమంత్రంగా ఆక్రమణల తొలగింపు
- కొన్ని ప్రాంతాలకే పరిమితమైన చర్యలు
- తొలగింపుల అనంతరం సైతం వెలుస్తున్న దుకాణాలు
- అధికారుల చర్యలపై పెదవి విరుస్తున్న ప్రజలు



పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

పొన్నూరు: పొన్నూరు పురపాలక పరిధిలో రహదారులు, కాల్వలను ఆక్రమించి పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొందరు కబ్జా చేసిన స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసి రూ. వేలల్లో అద్దెలకు సైతం ఇస్తున్నారు. దీంతో రహదారులు ఇరుకుగా మారి, పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి. పాదచారులు నడిచేందుకు దారి సైతం కరువైంది. ఈ పరిస్థితుల్లో ఇటీవల అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి కొన్ని రహదారులపై దుకాణాలు తొలగింపజేశారు. దీంతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి. కానీ పూర్తిస్థాయిలో తొలగింపు జరగలేదు. దీంతో అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. రాజకీయ ఒత్తిడిల నేపథ్యంలో ఆక్రమణల తొలగింపు పలు దుకాణాలకే పరిమితమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక చోట ఆక్రమణలు తొలగించి, మరో చోట తొలగింపు చేపట్టలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కొన్ని ప్రాంతాల్లోనే ..

పట్టణ ప్రజలతో పాటు వివిధ అవసరాల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వేల మంది పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లు ప్రధాన రహదారి విస్తరణ కూడా జరిగింది. అయినా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

> అధికారులు మొదలుపెట్టిన ఆక్రమణల తొలగింపు నాయకుల ఒత్తిడి మేరకే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్భాటంగా మొదలైన ప్రక్రియ కొన్ని దుకాణాల ముందు ఆక్రమణల తొలగింపు అనంతరం ఆ ప్రక్రియ అటకెక్కింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో దుకాణాల ముందు టీస్టాళ్లు, సిగరెట్ దుకాణాలు సైతం కొనసాగుతున్నాయి. దీంతో ఇప్పట్లో ట్రాఫిక్ కష్టాలు తీరేలా లేవని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

ఒత్తిళ్లతో అటకెక్కిన ప్రక్రియ!

గత కొన్ని నెలల క్రితం ట్రాఫిక్ సమస్యతో పాటు డ్రెయిన్లపై ఆక్రమణలను పురపాలక అధికారులు పోలీసుల సాయంతో తొలగింపు చేపట్టారు. దుకాణాల ముందు భాగాన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులపై కఠినంగా వ్యవహరించి ఆక్రమణలు తొలగించారు. ఆర్టీసీ బస్ డిపో, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, కూరగాయల మార్కెట్, ఐలాండ్ సెంటర్ ప్రాంతాల్లో దుకాణాల ముందు, రహదారులు, కాల్వలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు తొలగించారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండే ప్రధాన ప్రాంతాల్లో ఆక్రమణలపై దృష్టిసారించడంలేదనే విమర్శలు ఉన్నాయి.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ఐలాండ్ సెంటర్, బాపట్ల రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టాప్‌లు, ముబారక్ నగర్, వీధుల్లో రహదారులు, ఫుట్‌పాత్‌లపై బడ్డీ దుకాణాలు, టీ స్టాళ్లు, సమోసా దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. వారి నుంచి దుకాణదారులు రూ. వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇవి రద్దీ ప్రాంతాలు కావడంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. ఎస్పీపీ రోడ్డు, బాపట్ల రోడ్డులో ఆక్రమణలతో విశాల రహదారులు ఆనవాళ్లు కోల్పోయాయి. పాదచారులు నడిచేందుకు దారి లేక ప్రధాన రహదారిపై నడవాల్సి వస్తోంది. రహదారులపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తే చర్యలు

తెనాలి డీఎస్పీ జనార్ధనరావు


సుద్దపల్లికి చెందిన పెద్దలతో మాట్లాడుతున్న తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

చేబ్రోలు: ప్రశాంతమైన గ్రామాల్లో స్వల్ప వివాదాల కారణంగా ఘర్షణలకు దారి తీయటం మంచిది కాదని తెనాలి డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఇరువర్గాలకు చెందిన వారు వినాయక నిమజ్జనం సందర్భంగా ఘర్షణలకు పాల్పడ్డారు. అప్పటి నుంచి గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ప్రాంగణం వద్ద గ్రామానికి చెందిన ఇరువర్గాలకు చెందిన గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. వివాదాలకు స్వస్తి పలకాలని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించారు. ప్రశాంత వాతవరణాన్ని దెబ్బతీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పొన్నూరు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు, నారిశెట్టి రాఘవ, ఇరువర్గాలకు చెందిన పెద్దలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

స్టాకుల్లో వ్యత్యాసాలుండటంతో రెండు దుకాణాల్లో ఎరువుల అమ్మకాలు నిలిపివేత


దుకాణాల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం వంగిపురంలోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, లైసెన్సులు, స్టాక్ భౌతిక నిల్వలను పరిశీలించారు. ఈపాస్ మిషన్లలో ఉన్న నిల్వలకు భౌతికంగా గోడౌన్లలో ఉన్న నిల్వలకు మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుబ్బలక్ష్మి పెస్టిసైడ్స్‌లో రూ. 4,80,000 విలువ చేసే 200 డీఏపీ బస్తాలు, 180 బస్తాల 20-20, శ్రీనివాస ఏజెన్సీస్‌లో రూ. 9,24,000 విలువ చేసే 700 బస్తాల డీఏపి అమ్మకాలను నిలిపివేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఇన్స్‌పెక్టర్ కె. చంద్రశేఖర్, ఏవో సీహెచ్. ఆదినారాయణ, ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారి షేక్ సుగుణ బేగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోండి

నెహ్రూ నగర్: సచివాలయ ఉద్యోగులు ఇంటి ఇంటికి వెళ్లి రేషన్ సరఫరా చేయాలని రాష్ట్రంలోని అనేక చోట్ల రెవెన్యూ అధికారులు ఇస్తున్న ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ- వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉన్నత విద్యావంతుల భవిష్యత్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందో చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అంటే విలువ లేకుండా చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు.

కాలువ కట్టలను బాగు చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు

పెదకాకాని: భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలువ కట్టలను బాగు చేసి, మంచినీటి చెరువుకు పడిన గండికి మరమ్మతులను చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో ఆదివారం సీపీఎం మండల కమిటీ సమావేశం ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ ఈ 12వ తేదీన కురిసిన వర్షాలకు గుంటూరు ఛానల్ కాలువకట్ట పొంగి పొర్లి అనేక చోట్ల కోతకి గురయిందన్నారు. అలానే పెదకాకానిలో 25 వేలమందికి మంచినీరు అందించే చెరువుకట్టకు గండి పడి పక్కనే ఉన్న మురుగునీరు అంతా మంచినీటి చెరువులోకి చేరిందని, ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. తక్షణమే చెరువు కట్ట, కాలువ కట్టలకూ మరమ్మతులు చేయాలన్నారు. అలానే నంబూరు, గోళ్లమూడి గ్రామంలో చిన్న వర్షానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామంలో చప్టాలు ఉన్న చోట హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే కాలవకట్టలు, చెరువు కట్టలకు మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదని తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, పార్టీ సభ్యులు కె.ఆదం, ఎస్.నీలాంబరం, బురదగుంట సాంబయ్య, కె.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం

సీనియర్ డెంటిస్ట్ ప్రత్యూష



సంస్థ సభ్యులకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సీనియర్ దంతవైద్య నిపుణురాలు కొండా ప్రత్యూష

లక్ష్మీపురం: మన శరీరానికి మంచిగా పోషకాలు అందాలంటే మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సి ఉందని ఈ విషయంలో దంతాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని ప్రముఖ సీనియర్ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ కొండా ప్రత్యూష అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన దంతాలు ఆరోగ్యంగా, బలంగా ఉంటే అన్ని రకాల ఆహార పదార్థాలు బాగా నమిలి తినే అవకాశం ఉంటుందని తద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చునన్నారు. దంతాలు సక్రమంగా లేకుంటే సరిగా నమిలి తినలేమని దీనితో జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయని, అరుగుదల సరిగ్గా అవ్వక రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. సహజ సిద్ధంగా మనకు లభించిన దంతాలను సంరక్షించుకోవాలని ఒకవేళ ఏదో కారణం వలన దంత సమస్యలు ఏర్పడినప్పుడు కృత్రిమ దంతాలను పెట్టించుకోవటం మంచిదేనన్నారు. జ్ఞాన దంతం సాధారణంగా 40 సంవత్సరాల లోపు వారికి వస్తుందని అది వచ్చిన సందర్భాల్లో ఇబ్బందికరంగా ఏదైనా అనిపిస్తే తొలగించవచ్చునని దాని వల్ల నష్టమేమీ ఉండదన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ ప్రత్యూషని ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ కే చంద్రశేఖర రావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

త్వరితగతిన తాగునీరు సరఫరా చేయాలి


సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్ఆర్(లక్ష్మీపురం) రిజర్వాయర్‌కు తాగునీటిని సరఫరా చేసే 900 ఎంఎం డయా పైపులైన్‌కు నెహ్రూనగర్ పంపింగ్ హౌస్ వద్ద, సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనుల వలన నగరంలో మూడు రోజుల పాటు తాగునీటి సమస్య ఉంటుందని అధికారులు చెప్పిన నేపథ్యంలో సదరు పనులను వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పరిశీలించారు. ఇంటర్ కనెక్షన్ కలిపే జంక్షన్ పాయింట్ వద్ద రెండు పైపులను జాయింట్ చేసే పైపులకు ఒక పైపు ఒక మీటర్ కిందకు ఉండటం గమనించారు. మీటర్ ఎత్తులో ఉంటే వాటర్ ఫోర్స్ ఒకే విధంగా ఉంటుందా.. లేదా అని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పైపులైన్ నెహ్రూనగర్ నుంచి రైల్వే గేటు కింద నుంచి చుట్టూ తిరిగి రావడం వలన పైపులైన్‌లో వాటర్ ఫోర్స్‌కి ఏమైన లీకులు అయ్యే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ రైల్వే అధికారుల సూచనల మేరకు పైపులైన్ చుట్టూ తిప్పాల్సి వచ్చిందన్నారు. దీని వలన ఎటువంటి లీకేజీ సమస్య రాదని..అల్రెడీ పంపింగ్ టెస్టింగ్ చేయడం కూడా జరిగిందన్నారు. మీటర్ ఎత్తులో ఉన్నప్పటికి మోటార్ల ద్వారా పంపింగ్ జరుగుతుండటం వలన పంపింగ్‌లో ఎటువంటి సమస్య ఉండని కార్పొరేటర్లకు అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి నగర వాసులకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, మొహమూద్, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ అబీద్, పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), వైఎస్సార్‌సీపీ నాయకులు బోడపాటి కిషోర్, మల్లవరపు రవిరాజా పాల్గొన్నారు.

నిడమర్రులో చోరీ

నిడమర్రు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రులో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కురంగేశ్వరరావు కుటుంబసభ్యులతో సహా ఆగస్టు 24వ తేదీన తిరుపతి వెళ్లారు. 26వ తేదీ తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.4 లక్షల విలువైన 30 గ్రాముల బంగారం, పలు వెండి వస్తువులు, రూ.45 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన దుండగులు చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో తమ ద్విచక్ర వాహనం వదిలి పారిపోయారని, వాహనం నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

బై..బై.. గణేషా..!

- కోలాహలంగా వినాయక నిమజ్జనాలు
- చేబ్రోలు కొమ్మమూరు ఛానల్ వద్దకు తరలివచ్చిన గణపతి విగ్రహాలు


పెదకాకాని కాకతీయ యూత్ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ


చేబ్రోలు కొమ్మమూరు ఛానల్ నిమజ్జన కేంద్రం వద్దకు తరలివచ్చిన వినాయక విగ్రహాలు

చేబ్రోలు: బై... బై...బొజ్జ గణపయ్యా.. జై బోలో గణపతి మహరాజ్‌కీ అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. ప్రత్యేకంగా వాహనాలపై అలంకరించిన వినాయక విగ్రహాలను గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు చేసి అనంతరం నిమజ్జనం చేశారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు నిమజ్జనా కేంద్రాలకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చాయి. చేబ్రోలులోని కొమ్మమూరు ఛానల్ నిమజ్జన కేంద్రానికి, వడ్లమూడి గరువుపాలెం సంగం జాగర్లమూడి లాకుల వద్ద నిమజ్జనా కేంద్రానికి భారీ వినాయక విగ్రహాలు, చిన్న వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వందల సంఖ్యలో తరలివచ్చాయి. కొమ్మమూరు ఛానల్ వద్దకు గుంటూరు, పొన్నూరు, చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోల్లో పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను తీసుకొచ్చారు. గ్రామాల్లో విగ్రహాలను మేళతాళాలు, తప్పెట్లు, ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కొమ్మమూరు ఛానల్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిమజ్జన కేంద్రం వద్ద పొంచి ఉన్న ప్రమాదం

చేబ్రోలు కొమ్మమూరు ఛానల్ నిమజ్జన కేంద్రం వద్ద ప్రమాదం పొంచి ఉంది. కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా చేబ్రోలు వైపు భాగంలో తారు రోడ్డును తవ్వ వదిలేశారు. దీంతో అక్కడ రాకపోకలకు తీవ్ర సమస్య ఏర్పడుతోంది. వాహనాల రద్దీ అధికం కావడంతో బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంది. నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

రూ.1.20లక్షలు పలికిన లడ్డూ..

పెదకాకాని: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గణపతికి ప్రతి రోజూ పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను మేళతాళాలు, కనకతప్పెట్ల నడుమ గ్రామోత్సవం చేసి నిమజ్జనానికి తరలిస్తున్నారు. పెదకాకానిలోని మూడవ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపంలోని విఘ్నేశ్వరునికి ఐదు రోజుల పాటు పూజలు జరిపించారు. ఆదివారం భక్తులు స్వామివారికి సమర్పించిన 15 కిలోల లడ్డూకు వేలం జరిగింది. ఈ వేలం ద్వారా కాకతీయ యూత్ రూ.1,20,000లకు దక్కించుకున్నారు. అలానే పెదకాకాని గౌడపాలెం గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలో పూజా కార్యక్రమాల అనంతరం వేలం ఏర్పాటు చేశారు. ఈ పాట ద్వారా లడ్డూను స్థానిక భక్తులు రూ.72 వేలకు దక్కించుకున్నారు. గణేష్ విగ్రహాన్ని అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరిపి, అనంతరం నిమజ్జనానికి తరలించారు.

రూ.2 లక్షలు పలికిన లడ్డూ


లడ్డూతో తాళ్లూరి పార్థసారధి

చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం వినాయక లడ్డూ వేలంలో రూ.2లక్షల ధర పలికింది. శలపాడులో చౌదరి యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వాహకులు 25కిలోల లడ్డూను పెట్టారు. నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి వేలం నిర్వహించారు. రికార్డు స్థాయిలో లడ్డూ ధర పలికింది. తాళ్లూరి శ్రీనివాసరావు కుమారుడు పార్థసారధి రూ.2,02,000లకు లడ్డూను దక్కించుకున్నాడు. వేలంలో దక్కించుకున్న లడ్డూను భక్తిశ్రద్ధలతో తాళ్లూరి శ్రీనివాసరావు దంపతులతో పాటు కుమారుడు పార్థసారధిలు బంధువులతో కలిసి తలపై పెట్టుకొని మేళతాళాలతో ఇంటికి తరలివెళ్లారు.

గుండెపోటుపై అవగాహన రేపు

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశంలో మంగళవారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీవీసీ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ వై.రామ్‌కిషోర్ కార్యక్రమంలో పాల్గొని 'గుండెపోటుకు కారణాలు.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై ప్రత్యేక ప్రసంగం చేయనున్నారని,. సభ్యుల సందేహాలను నివృత్తి చేస్తారని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.


'మా నీళ్లను వేరేచోటకు మళ్లిస్తే సహించం'

- స్వర్ణభారతినగర్ వాసుల ఆందోళన
- పేదల కాలనీ నీటిని అపార్ట్‌మెంట్లు, బార్‌లకు తరలించే యత్నాన్ని అడ్డుకున్న స్థానికులు


నీటిని తరలించేందుకు తీస్తున్న గుంత వద్ద కాలనీ వాసుల ఆందోళన

గుంటూరు రూరల్: అధికారం మాది మేం ఏం చేసిన ఎవ్వరూ మాట్లాడకూడదు అన్నట్లుంది టీడీపీ నేతల తీరు. 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు కాలనీకి వచ్చే పైప్‌లైన్ నుంచి తాగునీటిని టీడీపీ నేతలకు చెందిన అపార్ట్‌మెంట్‌లు, బార్‌లకు తరలిస్తున్నారని సమాచారం తెలిసిన కాలనీ వాసులు ఆదివారం రాత్రి పైప్‌లైను పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ కాలనీకి వచ్చే నీరు తాగేందుకే సరిపోవట్లేదని, వేరే వారికి కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాగునీటిని మళ్లించేందుకు తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని ఆందోళన చేపట్టారు. కాలనీకి వచ్చే నీటిని వేరేవారికి కేటాయిస్తే వర్షాకాలంలోనే తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తాము వేసవిలో మరింత ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అక్రమంగా చేపట్టిన నీటి తరలింపును నిలుపు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దీంతో అధికారులు కాలనీ వాసులను అడ్డుకునేందుకు ప్రయత్నించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆహారం, వ్యాయామం ఎంతో అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ శారద

తెనాలి: మనిషి జీవనశైలిలో ఆహారం, వ్యాయామం ప్రత్యేకించి ముఖ్యమైనవని డాక్టర్ డి.శారద అన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. డి-3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు నిర్వహించి రోగులకు అల్పాహారం అందించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ.. షుగర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, కాళ్లకు పుండ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మనిషి జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులు ప్రత్యేకించి ఆహారం, వ్యాయామం వంటి విషయాలను తెలియజేశారు. శిబిరంలో కొందరికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోగులకు నెలకు సరిపడా అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.